క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

కాగజ్‌నగర్‌రూరల్‌: కొత్తపల్లి వెంకటలక్ష్మి, చంద్రయ్య మెమోరియల్‌ సర్వీస్‌ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కిమ్స్‌ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 41 మంది రోగులకు హాజరు కాగా, 22 మంది శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. లయన్స్‌ క్లబ్‌ సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు వసి, గోపి తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని దారికి అడ్డంగా కంచె



గ్రామస్తులు ఏర్పాటు చేసిన కంచె

కాగజ్‌నగర్‌రూరల్‌: సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామానికి వెళ్లే దారికి అడ్డుగా మంగళవారం కంచె ఏర్పాటు చేసి మండలంలోని రాస్పెల్లి గ్రామ పంచాయతీలోని బారెగూడ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని అంతర్గత రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉంటుందని పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షపునీరు రోడ్లపైకి చేరి నిల్వ ఉంటుందన్నారు. వరద నీటి నుంచే వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

'బూర్గుడ హెచ్‌ఎంను సస్పెండ్‌ చేయాలి'

ఆసిఫాబాద్‌: అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఉపాధ్యాయులను వేదిస్తున్న ఆసిఫాబాద్‌ మండలంలోని బూర్గుడ యూపీఎస్‌ ప్రధానోపాధ్యాయుడు మంథెన శ్యాంసుందర్‌పై చర్యలు తీసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయుడు పెండ్యాల సదాశివ్‌ కోరాడు. జిల్లా కేంద్రంలో మంగళవారం డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందించాడు. హెచ్‌ఎం శ్యాంసుందర్‌ ఉపాధ్యాయులపై దుర్భాషలాడుతున్నారని ఆరోపించాడు. తనకు రావాల్సిన ఇంక్రిమెంట్లు నిలుపుదల చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

దహెగాంలో భారీ వర్షం



దహెగాం: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వారసంత కావడంతో వర్షంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

ప్రయాణం.. ప్రాణసంకటం!

- అటవీ అనుమతుల రాక ఆగిన రోడ్డు నిర్మాణాలు
- కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేని పరిస్థితి
- రాకపోకలకు ప్రయాణికులకు తప్పని అవస్థలు
- వర్షాకాలంలో అధ్వానంగా రహదారులు



ఇందాపూర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి



ఇంద్రానగర్‌ వద్ద కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద

కెరమెరి: అనుమతులు లేక ఏళ్లుగా జిల్లాలోని రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రజలకు ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోంది. ఏటా నామమాత్రంగా మొరంతో మరమ్మతులు చేపడుతున్నా.. వర్షాకాలం నాటికి పరిస్థితి యథాస్థితికి చేరుకుంటుంది. ప్రభుత్వం మరమ్మతుల కోసం మంజూరు చేస్తున్న నిధులు వృథాగా మారుతున్నాయి.

అటవీశాఖ అడ్డంకి..

కెరమెరి మండల కేంద్రం సమీపంలోని సాంగ్వి క్రాస్‌ రోడ్డు నుంచి ఇందాపూర్‌ గ్రామం వరకు 20 కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఇందులో కెరమెరి నుంచి అగర్‌వాడ వరకు బీటీ రోడ్డు ఉంది. అగర్‌వాడ నుంచి ఉమ్రి వరకు అటవీ అనుమతులు లేవని రోడ్డు నిర్మించలేదు. మళ్లీ ఉమ్రి నుంచి ఇందాపూర్‌ వరకు బీటీ రోడ్డు నిర్మించారు. దాదాపు 18 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించారు. మధ్యలో రోడ్డు మట్టి రోడ్డు ఉండటంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. చాలా చోట్ల గుంతలు పడి నడిచేందుకు కూడా ఆమోదయోగ్యంగా లేదు. అంగర్‌వాడ, ఇంద్రానగర్‌ సమీపంలో భారీగా కోతకు గురైంది. ఇందాపూర్‌ వైపు ఉన్న 15 గ్రామాల ప్రజలు ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నారు.

అనుమతులు రాలేదు

కెరమెరి మండల కేంద్రం నుంచి ఇందాపూర్‌ గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ నుంచి అనుమతులు రాలేదు. ప్రజల ప్రయాణ సమస్యలు పరిష్కరించేందుకు తాత్కాలిక చర్యలు తీసుకోవాలి.

– సయ్యద్‌ మజారొద్దీన్‌, కెరమెరి ఎఫ్‌ఆర్‌వో

అటవీశాఖ అధికారులు చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలకు గుంతలమయం

- అధ్వానంగా మారిన నలుగుపల్లి, పెంచికల్‌పేట్‌ రోడ్డు
- 108 అంబులెన్స్‌ కూడా రాలేని దుస్థితి



గుంతలమయంగా సలుగుపల్లి, పెంచికల్‌పేట్‌ రోడ్డు

బెజ్జూర్‌: సిర్పూర్‌ నియోజకవర్గంలో రోడ్లు గుంతలమయంగా మారాయి. వాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. బెజ్జూర్‌ మండలంలోని సలుగుపల్లి నుంచి పెంచికల్‌పేట్‌ వరకు కేవలం 15 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డు అడుగడుగునా గుంతలు పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ మార్గం గుండానే బెజ్జూర్‌కు ఆర్టీసీ బస్సులు నడుస్తుంటాయి. రోడ్లు సక్రమంగా లేక డ్రైవర్లు సైతం అవస్థలు పడుతున్నారు. రెండేళ్ల క్రితం సలుగుపల్లి నుంచి పెంచికల్‌పేట్‌ మధ్య రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. అటవీ ప్రాంతం కావడంతో అటవీశాఖ నుంచి అనుమతులు రాలేదు. ఆ రోడ్డు పనులు నిలిచిపోయాయి. పదేళ్ల క్రితం వేసిన రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

నీటిమూటలైన హామీలు..

కాగజ్‌నగర్‌– భట్టుపల్లి, అందవెల్లి, చింతలమానెపల్లి– గూడెం, గూడెం– సోమిని, ఏటిగూడ– పెంచికల్‌పేట్‌ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అటవీ శాఖ అనుమతులు లేక మరమ్మతులు చేపట్టడం లేదు. పలుమార్లు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతులు సమర్పించినా నేటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. వర్షాకాలంలో కనీసం కాలినడకన కూడా రోడ్లు దాటలేని పరిస్థితి ఎదురవుతోంది. 108 అంబులెన్స్‌ సైతం రాలేని దుస్థితి. రోగులను ఆస్పత్రికి తరలించాలంటే పెద్దసవాలుగా మారింది. బురదమయంగా మారిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని రాస్పెల్లి జిల్లా పరిషత్‌ సెకండరీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం షీ టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. షీ టీం సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ హింస, ఈవ్‌టీజింగ్‌, సైబర్‌క్రైం నేరాలకు గురైన వారు వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. ఫేస్‌బుక్‌, వాట్సాప్‌, ఇన్‌స్టాగాం తదితర సోషల్‌ మీడియా యాప్‌ల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై పోలీసు కళాబృందం ద్వారా అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలన్నారు. సైబర్‌నేరాల నియంత్రణ, మహిళల భద్రత, బాల్యవివాహాలు తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ శంకరయ్య, పట్టణ ఎస్సై అంజయ్య పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



జిల్లా కేంద్రంలో కేక్‌ కట్‌ చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌ చౌక్‌ వద్ద మంగళవారం రాష్ట్ర మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్‌ ఆధ్వర్యం లో కేక్‌ కట్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు జక్కన్న, నిజాం, బాలేష్‌, ఆరీఫ్‌, హరిరాం, మురళి, మోహన్‌, బాలు, వెంకటేశ్‌, ఇరుకుల మంగ పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని సుల్తాన్‌గూడలో మంగళవారం రాష్ట్ర సీతక్క జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ కట్‌ చేశారు. కార్యక్రమంలో రవూఫ్‌, సుజాయత్‌ఖాన్‌, మహమ్మద్‌, ప్ర కా శ్‌, అలీం, అయ్యూబ్‌ ఫైజల్‌, ఫారుఖ్‌ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కాగజ్‌నగర్‌రూరల్‌: రాష్ట్ర మంత్రి సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎమ్మెల్సీ దండే విఠల్‌ ఆదేశాల మేరకు కాంగ్రెస్‌ నాయకులు పట్టణంలోని ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ షబ్బీర్‌ హుస్సేన్‌, నాయకులు రాణా ప్రతాప్‌ సింగ్‌ పాల్గొన్నారు.

గోలేటిలో ఘనంగా వేడుకలు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లో మంగళవారం కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి సీతక్క జన్మదినం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌ చేసి సంబురాలు చేసుకున్నారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి సీతక్క భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌గౌడ్‌, పల్లాస్‌, సురేందర్‌ రాజు, దుర్గం రవీందర్‌, ప్రభాకర్‌, ఎర్రం తిరుపతి, పూదరి సాయికిరణ్‌, పర్వతి సాయి, పొన్న శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌: మండల కేంద్రంలో నిర్వహించిన మంత్రి సీతక్క జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్‌ ముకీద్‌, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి మరణం తీరని లోటు

కాగజ్‌నగర్‌రూరల్‌: ఎస్పీఎం కార్మిక నాయకుడు వొల్లాల యాదగిరి అనారోగ్యంతో మృతి చెందడం తీరని లోటని సీనియర్స్‌ సిటిజన్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు, కార్యదర్శి మార్త సత్యనారాయణ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్‌లో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రమణయ్య, నారాయణ, ఎల్లాగౌడ్‌, వాహాబు, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్నూరుకాపు నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు, ఎస్పీఎం ట్రేడ్‌ యూనియన్‌ మాజీ ప్రధాన కార్యదర్శి వొల్లాల యాదగిరి మృతిపై బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశం, ఎస్పీఎం ట్రేడ్‌ యూనియన్‌ నాయకులు రాములు, సారంగపాణి, గోపాల్‌రావు తదితరులు నివాళులర్పించారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎంపీడీవో రమేశ్‌

కాగజ్‌నగర్‌రూరల్‌: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో రమేశ్‌ అన్నారు. మండలంలోని ఎన్‌జీవోఎస్‌ కాలనీలో మంగళవారం నిర్వహించిన వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. దుర్గానగర్‌ గ్రామ పంచాయతీలో నిర్వహించిన వనమహోత్సవంలో ఎంపీవో గౌరీశంకర్‌ పాల్గొని కూలీలతో కలిసి మొక్కలు నాటారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్ష చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండోరోజు కొనసాగాయి. బొగ్గు బ్లాకులను నామినేషన్‌ పద్ధతిలో సింగరేణి సంస్థకే కేటాయించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్‌.తిరుపతి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు.కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఫిట్‌ కార్యదర్శి మారం శ్రీనివాస్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శులు జగ్గయ్య, ఆనంద్‌, ఫిట్‌ కార్యదర్శులు రామయ్య, శ్రీధర్‌, మల్లేశ్‌, రఘునాథ్‌, ఆశోక్‌, శ్రీను, ఆశీష్‌, సమీ, రాజయ్య, అమర్‌ సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి



ధనోరాలో నిల్వ నీటిని పారబోయిస్తున్న అధికారులు

కెరమెరి: వర్షాకాలం నేపథ్యంలో ప్రతిఒక్కరూ పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో అంజద్‌ పాషా అన్నారు. మండలంలోని ధనోరా, రింగన్‌ఘాట్‌, కొఠారి గ్రామాల్లో డ్రైడేను శుక్రవారం పరిశీలించారు. నిల్వ నీటిని పారబోయించారు. ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీలను శుభ్రం చేయాలన్నారు. ప్రతీ మంగళవారం, శుక్రవారాల్లో డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

బాలాజీఅనుకోడలో వైద్యశిబిరం

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామంలో మంగళవారం బాబాపూర్‌– రవీంద్రనగర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు వ్యాప్తి చెందుతుండడంతో గ్రామస్తులకు వివిధ పరీక్షలు చేశారు. బాబాసాగర్‌ పల్లె దవాఖాన వైద్యాధికారి సునీత ఆధ్వర్యంలో మందులు అందజేశారు. వర్షాకాలం నేపథ్యంలో జ్వరాలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ ఇందిర, ఎఎన్‌ఎంలు రోసియా, సిబ్బంది స్వప్న, ఆశ వర్కర్లు రజిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మి మొక్కులు



మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: పుంజుమేరగూడలోని శ్రీభూవమ్మతల్లి దేవస్థానాన్ని సోమవారం రాత్రి ఎమ్మెల్యే కోవ లక్ష్మి సందర్శించారు. మొహర్రం వేడుకలు ప్రా రంభమైన నేపథ్యంలో భూవమ్మతల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. నాయకులు రంగు మహే ష్‌గౌడ్‌, భరద్వాజ్‌, మల్రాజు శ్రీనివాస్‌రావు, మారిన వెంకటేశ్వర్లు, ఓరం కిరణ్‌, సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

చదువులో ముందుండాలి



విద్యార్థితో చదివిస్తున్న సభ్యులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువులో ముందుండాలని రూం టూ రీడ్‌ సేవా సంస్థ సభ్యురాలు జెన్నీఫర్‌ రాణి అన్నా రు. కౌటాల, కన్నెపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో రూం టూ రీడ్‌ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు అక్షర గుర్తింపు, చదవడం, మాట్లాడడం నేర్పించాలన్నారు. గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. హెచ్‌ఎంలు నారాయణసింగ్‌, హన్మంతు పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా..!


- పుస్తకాల ముద్రణలో మార్పులు
- ఈ ఏడాది నుంచి 'పది' విద్యార్థులకు ద్విభాషా పాఠ్యపుస్తకాలు

నార్నూర్‌: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆంగ్ల విద్యను అమలు చేస్తోంది. అయితే ఆంగ్ల బోధన వింటున్న విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా వారిలో నైపుణ్యం పెంచేలా, మూడేళ్లుగా ద్విభాష (తెలుగు, ఆంగ్లంతో ముద్రించినవి) పుస్తకాలు అందిస్తోంది. ఏటా ఒక్కో తరగతి పెంచుతూ ద్విభాష పుస్తకాలను పంపిణీ చేస్తుండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతికి వర్తింపజేస్తున్నారు. ఈ మేరకు పాఠ్యపుస్తకాలు రాగా, వాటిని నార్నూర్‌, గాదిగూడ ఉమ్మడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దాదాపు 9485మంది విద్యార్థులకు మూడు వారాలుగా పంపిణీ చేస్తున్నారు.

విద్యార్థులు ఇబ్బంది పడకుండా...

చాలా సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం సక్సెస్‌ పాఠశాలల పేరుతో కొన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ బోధన ప్రారంభించింది. అయితే బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇవి పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదు. ఇలాంటి నేపథ్యంలో తిరిగి 2022–23 విద్యా సంవత్సరం నుంచి విద్యాశాఖ అన్ని పాఠశాలల్లో ఆంగ్ల బోధన అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే అప్పటి వరకు తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులు, ఆంగ్ల మాధ్యమంలో చదవడం ఇబ్బందిగా మారుతుందని గుర్తించి, వారు తేలికగా అర్థం చేసుకునేందుకు పుస్తకాల ముద్రణలో మార్పులు చేశారు.

- ప్రతి పాఠ్యాంశంలో ఒక పేజీలో తెలుగు, మరో పేజీలో ఆంగ్లం ముద్రించారు. మొదటిసారిగా ఎనిమిదో తరగతి వరకు భాషేతర పుస్తకాలైన గణితం, సామాన్య శాస్త్రం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం పుస్తకాల్లో ముద్రించారు. మరుసటి ఏడాది తొమ్మిదో తరగతికి అందించగా, ప్రస్తుత ఏడాది పదో తరగతికి వర్తింపజేస్తున్నారు. దీంతో విద్యార్థులు సులభంగా పాఠాలు అర్థం చేసుకునేందుకు ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు అవకాశం లభించింది.



ఇంగ్లిష్‌, తెలుగు భాషల్లో ముద్రించిన పాఠ్యపుస్తకం

నార్నూర్‌, గాదిగూడ మండలాల్లో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

పాఠశాలలు	నార్నూర్‌లో స్కూల్స్‌	విద్యార్థులు	గాదిగూడలో స్కూల్స్‌	విద్యార్థులు
ఎంపీపీఎస్‌(తె/మీ)	25	1217	21	737
ఎంపీపీఎస్‌ ఉ/మీ	03	137	-	-
డీఎన్‌టీపీఎస్‌	01	12	-	-
టీడబ్ల్యూపీఎస్‌	36	966	48	921
యూపీఎస్‌	01	80	02	147
జెడ్పీఎస్‌ఎస్‌ తె/మీ	03	430	-	-
జెడ్పీఎస్‌ఎస్‌ ఉ/మీ	01	108	-	-
మోడల్‌ స్కూల్‌	01	298	-	-
ఆశ్రమ పాఠశాలలు	04	1321	03	991
కస్తూర్బా గాంధీ పాఠశాలలు	01	196	01	340
మినీ గురుకులం	-	-	01	150
శాటిలైట్‌ సెంటర్‌	-	-	02	339
ప్రైవేట్‌ స్కూల్స్‌	05	851	02	244
మొత్తం	81	5,616	80	3,869

- అలాగే విద్యార్థులకు పుస్తకాల భారం పడకుండా, ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ప్రతి పుస్తకాన్ని రెండు భాషల్లో ముద్రించడం వల్ల పేజీల సంఖ్య పెరిగి రెట్టింపు భారం అవుతుంది. ఈ సమస్య తలెత్తకుండా రెండు విభాగాలుగా పుస్తకాలను విభజించారు. సగం పాటాలను భాగం–1, మిగితా సగాన్ని భాగం–2గా విభజించి రెండు దఫాలుగా పుస్తకాలను అందించనున్నారు. ఈ ఏడాది పదో తరగతి వరకు ద్విభాష పుస్తకాలను అందించడంతో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఆంగ్ల బోధన అందినట్లేనని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

చాలా సులభంగా అర్థం అవుతుంది



తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో పుస్తకాలు ముద్రించడం వల్ల చదువుతో పాటు అర్థం చేసుకోవటానికి చాలా సులభంగా ఉంటుంది. గతేడాది కొద్దిగా భయం ఉండేది. ప్రస్తుతం ద్విభాషలో పుస్తకాలు ముద్రించడం వల్ల పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాం.

– దుర్గె అశ్విని, పదో తరగతి

భయం పోయింది



పదో తరగతిలో ద్విభాషలో పుస్తకాలు ముద్రించి రావడంతో, పాఠాలు సులభంగా అర్థం అవుతున్నాయి. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను తెలుగులో చదవడంతో ఆంగ్లంలో ఈజీగా ఉంది. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తామనే భరోసా వచ్చింది.

– నివేదిక్‌, పదో తరగతి

విద్యార్థులకు ఈజీగా..



ద్విభాషాలో 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు ముద్రించడం వల్ల సులభంగా అర్థమయ్యేలా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా ఉంది. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించవచ్చు. విద్యా బోధనలో ఎటువంటి ఇబ్బంది రాకుండా మంచి నిర్ణయం తీసుకున్నారు.

– పవర్‌ అనిత, నోడల్‌ అధికారి, నార్నూర్‌